## పన్ను వసూళ్లపై ఫోకస్..




2

## ట్రాక్టర్ బోల్తా ఒకరి మృతి



2

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in



## జిల్లాలో హిందూ సంఘాల నిరసనలు

2 లో



# రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యం : గడుగు



**అక్షరటుడే, ఇందూరు:** రైతును రాజు చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని రైతు కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ అన్నారు. జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా ఓ ప్రకటన విడుదల చేశారు. దివంగత మాజీ ప్రధాని చౌదరి చరణ్ సింగ్ జయంతిని పురస్కరించుకొని ప్రతి ఏటా డిసెంబర్ 23న రైతుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. రెండేళ్ల ప్రజాపాలనలో రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం రూ.లక్ష కోట్లకు పైగా వెచ్చించి ఎన్నో కార్యక్రమాలను చేపట్టిందన్నారు. రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, రైతు బీమా, సన్న వడ్లకు బోనస్ లాంటి కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు.



# ఆలూర్ సొసైటీ ఇన్‌ఛార్జిగా శీలం స్వప్న

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ఇన్‌ఛార్జిగా శీలం స్వప్న బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతుల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, రుణాలు సమయానికి అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే సహకార సంఘం ద్వారా రైతులకు ప్రభుత్వం అందించే అన్ని పథకాలను సక్రమంగా అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఈవో మల్లేష్, సిబ్బంది గంగాధర్, చింటూ, దేవన్న, దేవరాజ్ పాల్గొన్నారు.



# లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

**అక్షరటుడే, కామారెడ్డి:** స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే స్కానింగ్ సెంటర్‌ను సీజ్ చేస్తామని డీఎంహెచ్‌వో విద్య హెచ్చరించారు. జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో మంగళవారం జిల్లాస్థాయి అడ్వైజరీ పీసీపీఎండీటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. ప్రతినెలా స్కానింగ్ సెంటర్లను ప్రోగ్రాం ఆఫీసర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో తప్పనిసరిగా సందర్శించాలన్నారు. స్కానింగ్ సెంటర్లలో ఫాం-ఎఫ్ రిజిస్టర్లను తనిఖీ చేస్తూ స్కానింగ్ సెంటర్ నిర్వాహకులకు తగిన సూచనలు చేయాలన్నారు.

**కోడి గుడ్డు రేట్లు భారీగా పెరిగాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో విద్యార్థులకు గుడ్డు అందించడానికి నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. పేద విద్యార్థులకు పోషకాహారం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా ప్రతి విద్యార్థికి వారానికి మూడు గుడ్లు అందించాలని నిర్ణయించింది. అయితే గుడ్డు ధర రోజురోజుకు పెరగడంతో ప్రభుత్వం చెల్లించే రుసుము నిర్వాహకులకు గిట్టుబాటు కావడం లేదు. దీంతో విద్యార్థులకు పూర్తిస్థాయిలో గుడ్లను అందించలేకపోతున్నారు.**

- అక్షరటుడే, ఇందూరు



# కొండెక్కిన గుడ్డు ధర

■ రూ.8కి చేరిన రేటు ■ మధ్యాహ్న భోజన నిర్వాహకులపై భారం ■ వారానికి రెండు గుడ్లతో సరిపెడుతున్న వైనం

నిజామాబాద్ జిల్లాలో మొత్తం 1,158 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో సుమారు 94 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి నిత్యం మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నారు. ఈ పథకం కింద వారానికి మూడు కోడిగుడ్లు అందించాల్సి ఉంటుంది. అయితే మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ప్రభుత్వం ఒక్కో గుడ్డుకు రూ.6 అందజేస్తుంది. కానీ మార్కెట్‌లో మాత్రం ప్రస్తుతం ఒక గుడ్డు ధర రూ.8గా ఉంది. దీంతో నిర్వాహకులకు భారం తప్పడం లేదు. రెండు రూపాయల వ్యత్యాసం ఉండడంతో.. వారానికి ఒక్కో విద్యార్థిపై రూ.6 అదనపు భారాన్ని మోయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఆలస్యంగా బిల్లులు

కోడి గుడ్డు ధర పెరగడంతో ఇబ్బందులు పడుతున్న నిర్వాహకులకు బిల్లులు సైతం సక్రమంగా రావడం లేదు. దీంతో అప్పులు చేసి విద్యార్థులకు వండి పెడుతున్నామని మధ్యాహ్న భోజన కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల తరహాలో ప్రభుత్వమే కోడిగుడ్లను సరఫరా చేస్తే తమకు భారం తగ్గుతుందని అంటున్నారు. కాగా గతేడాది ప్రభుత్వం ఒక్కో గుడ్డుకు రూ.5 నుంచి రూ.6 కి పెంచింది. అయితే మార్కెట్‌లో రేటు రూ.8 కావడంతో ఇబ్బందులు తప్పడం లేదు. కొందరు నిర్వాహకులు అప్పులు చేసి మరి విద్యార్థులకు కోడి గుడ్డును అందజేస్తున్నారు. మరికొందరు మాత్రం వారానికి మూడు గుడ్లను అందజేయకుండా.. ఒకటి, రెండు గుడ్లతో సరిపెడుతున్నారు. దీంతో విద్యార్థులు కూడా నష్టపోవాల్సి వస్తుంది.

### ప్రభుత్వమే అందజేయాలి

కోడిగుడ్ల ధరలతో నిర్వాహకులపై అదనపు భారం పడుతుంది. ఇప్పటికే అప్పులు చేసి విద్యార్థులకు భోజనాన్ని అందజేస్తున్నాం. అంగన్‌వాడీల తరహా ప్రభుత్వమే కోడిగుడ్లు సరఫరా చేయాలి.

–చక్రపాణి, ఎండీఎం సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

# అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం: ఎమ్మెల్యే భూపతిరెడ్డి

**అక్షరటుడే, ఇందల్వాయి:** అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. ధర్పల్లిలో రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి పేదవాడికి చేరుతున్నాయన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి, వృత్తిపరమైన నైపుణ్యాభివృద్ధి కోర్సులు ప్రవేశపెట్టామని తెలిపారు. కాంగ్రెస్ బడుగు, బలహీన వర్గాల పార్టీ అని, దేశంలోని అన్ని కులాలు, మతాలను సమానంగా చూస్తుందని పేర్కొన్నారు. క్రిస్టియన్ మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసి రూ.20 వేల కోట్ల నిధులు కేటాయించిందని తెలిపారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు కావడం లేదని విమర్శించారు. రూరల్ నియోజకవర్గంలోని ఏడు మండలాలకు చెందిన క్రిస్టియన్ల కోసం కమ్యూనిటీ హాళ్లను కేటాయిస్తానని హామీ ఇచ్చారు. అలాగే గ్రేవ్ యార్డు కోసం స్థలం కావాలన్న అభ్యర్థనపై స్పందించిన ఎమ్మెల్యే, త్వరలో ప్రభుత్వ భూమిని కేటాయిస్తామని భరోసా ఇచ్చారు. మహిళల కోసం వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత రేషన్ బియ్యం, కొత్త రేషన్ కార్డులు, ఉచిత బస్సు ప్రయాణం వంటి సంక్షేమ పథకాలు



అమలవుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం భారీ కేక్‌ను కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో రాజేందర్, వివిధ మండలాల తహశీల్దార్లు, ఎంపీడీవోలు, ధర్పల్లి సర్పంచ్ చెలిమెలి శ్రీనివాస్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బాలరాజ్, సీనియర్ నాయకులు, క్రిస్టియన్ మైనార్టీ నాయకులు, ఫాదర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.

# కొత్త సర్పంచ్‌లు గ్రామాభివృద్ధికి తోడ్పడాలి



**అక్షరటుడే, పెద్దకొడప్‌గల్ :** పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన బీఆర్ఎస్ మద్దతుదారులైన సర్పంచ్‌లు గ్రామాభివృద్ధికి తోడ్పడాలని మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే అన్నారు. మండలంలోని విఠల్‌వాడి గ్రామంలో సర్పంచ్‌గా గెలిచిన శివాజీ రాథోడ్ విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్నారు. విజయం సాధించిన సర్పంచ్‌లు గ్రామాభివృద్ధి కోసం ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సూచించారు. కేసీఆర్ నాయకత్వంలో గ్రామాల అభివృద్ధికి చేసిన కృషిని ఆయన గుర్తు చేశారు. అనంతరం అదేబాటలో ప్రస్తుత సర్పంచ్‌లు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ప్రతాప్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రావణ్, హన్మంత్ రెడ్డి, రియాజ్, మహ్మద్, సాయి రెడ్డి, మాజీ సర్పంచ్‌లు కిషన్ పవర్, శంకర్ మహారాజ్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిజామాబాద్ జిల్లా పద్మశాలి యువజన సంఘం నూతన కార్యవర్గం



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నిజామాబాద్ జిల్లా పద్మశాలి యువజన సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు మైసల నారాయణ ఆధ్వర్యంలో నగరంలోని ఖలీల్‌వాడిలో గల కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడిగా పల్నాటి కార్తీక్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా గజం అభిలాష్, జిల్లా కోశాధికారిగా గెంట్యాల అజయ్‌లను ఎన్నుకున్నారు. అనంతరం యువజన సంఘం సభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యులు దాసరి నర్సింలు, జిల్లా అధ్యక్షుడు మైసల నారాయణ, సలహాదారులు గెంట్యాలు వెంకటేశ్, ఎస్.బాబురావు, చింతకింది సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

# వసతి గృహాన్ని సందర్శించిన మున్సిపల్ కమిషనర్



**అక్షరటుడే, బోధన్:** పట్టణ శివారులోని మైనారిటీ రెసిడెన్షియల్ బాలికల వసతి గృహాన్ని మంగళవారం మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, హాస్టల్‌లోని మెస్‌ను తనిఖీ చేశారు. విద్యార్థులకు వడ్డిస్తున్న వంటకాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. హాస్టల్‌కు వెళ్లేదారిలో వీధిదీపాలు లేక పాఠశాల సిబ్బంది ఇబ్బంది పడుతున్నారని ప్రిన్సిపల్ పద్మజ కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. అలాగే రోడ్డు సౌకర్యం కూడా లేక రాకపోకలకు అవస్థలు పడుతున్నామని పేర్కొనగా సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు.



# ఘనంగా క్రిస్మస్ వేడుకలు

**అక్షరటుడే, ఎల్లారెడ్డి: పట్టణంలోని స్థానిక జీవధాన్ హైస్కూల్‌లో మంగళవారం సపోజ్ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. తహశీల్దార్ ప్రేమ్, పాఠశాల ప్రిన్సిపాల్ ఫాదర్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ జోభిష్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ శుభాకాంక్షలు తెలిపారు. వేడుకల్లో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, విద్యార్థుల నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు షాదుల్లా, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.**



# పీఎం మోదీ రైతుల పక్షపాతి



**అక్షరటుడే, ఆర్మూర్:** ప్రధాని మోదీ రైతుల పక్షపాతి అని బీజేపీ ఆర్మూర్ పట్టణ అధ్యక్షుడు మందుల బాలు, జిల్లా రైతు నాయకులు నూతల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని గైని గురుడి రెడ్డి సంఘంలో ఉత్తమ రైతులను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రైతులకు రైతులకు కిసాన్ సమ్మాన్ యోజన కింద ఏడాదికి రూ. 5వేలు అందిస్తున్నారన్నారు. ఫసల్ బీమా యోజనలో భాగంగా రైతులు నష్టపోతే బీమా అందిస్తున్నారని.. ఎరువుల బస్తాపై సబ్సిడీలు ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు అనిల్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు శేషగిరి లింగం, ప్రధాన కార్యదర్శి తిరుపతి నాయక్, ఉపాధ్యక్షుడు దొండి ప్రకాష్, కార్యదర్శి ప్రసన్న గౌడ్, బీజేవైఎం అధ్యక్షుడు ఉదయ్ గౌడ్, మిరియాల్కర్ కిరణ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ రైటర్లు శాస్త్ర సాంకేతికతను వినియోగించుకోవాలి




**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ**: ప్రస్తుత కాలానికి అనుగుణంగా పోలీస్‌స్టేషన్ రైటర్లు శాస్త్ర సాంకేతికతను వినియోగించుకోవాలని అదనపు డీసీపీ (అడ్మిన్) బస్వారెడ్డి సూచించారు. ఈ మేరకు మంగళవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ హాల్‌లో స్టేషన్ రైటర్లకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు డీసీపీ.. స్టేషన్ రైటర్లకు నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. కేసు పరిశోధనలో భాగంగా కొత్త టెక్నాలజీ వాడే విధానాన్ని ఆయన వివరించారు. కేసు నమోదు నుంచి కోర్టులో ఛార్జీషీట్ దాఖలు చేసుకునే వరకు విధివిధానాలను ఆయన తెలియజేశారు. శిక్షణను మూడు రోజులపాటు నిర్వహించడం జరుగుతుందని.. తదుపరి స్టేషన్ రైటర్స్ సంబంధిత పోలీస్ స్టేషన్లకు వెళ్లిన తర్వాత తమ సిబ్బందికి ఈ వివరాలను వెల్లడించాల్సి ఉంటుందన్నారు. నూతన ఏడాది సందర్భంగా సైబర్ నేరగాళ్లు రెచ్చిపోయే అవకాశం ఉన్నందున ఎలాంటి అపరిచిత లింకులను తెరవద్దని ప్రజలకు అవగాహన కల్పించాల్సిందిగా డీసీపీ సూచించారు. కార్యక్రమంలో సైబర్ క్రైం ఏసీపీ వెంకటేశ్వర్ రావు , టౌన్ సీఐ శ్రీనివాస్ రాజ్, ట్రైనింగ్ సీటీసీ ఇన్‌స్పెక్టర్ శివరాం, ఐటీ కోర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు ప్రయోగాత్మక జ్ఞానం ఎంతో అవసరం

**అక్షరటుడే, భీమ్‌గల్:** విద్యార్థులు పుస్తక జ్ఞానంతో పాటు, ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంపొందించుకున్నప్పుడే భవిష్యత్తులో రాణిస్తారని భీమ్‌గల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జైపాల్ రెడ్డి అన్నారు. భీమ్‌గల్ పట్టణంలోని ఓం ఎంటర్‌ప్రైజెస్ ఓజేటీ సెంటర్‌ను మంగళవారం సందర్శించారు. ఒకేషనల్ విద్యార్థులకు అందిస్తున్న శిక్షణను పరిశీలించారు. శిక్షణలో భాగంగా ఫస్ట్, సెకండ్ ఒకేషనల్ విద్యార్థులు నిర్వహిస్తున్న ప్రయోగ వివరాలను ప్రిన్సిపాల్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు లెక్కలను ఏవిధంగా నమోదు చేస్తున్నారు. చేసిన అకౌంట్స్ వివరాలను పరిశీలించారు. కంప్యూటర్లలో బిల్లుల తయారీ విధానం తదితర అంశాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఒకేషనల్ కోర్సుల ద్వారా విద్యార్థులకు స్వయం ఉపాధి పొందే అవకాశాలు మెండుగా ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం నేర్చుకుంటున్న ఈ ప్రాక్టికల్ అంశాలు వారి వృత్తిపరమైన ఎదుగుదలకు ఎంతగానో తోడ్పడతాయని ప్రిన్సిపాల్ విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు క్రాంతి కృష్ణ, రాంచందర్, ఓం ఎంటర్ ప్రైజెస్ మేనేజ్‌మెంట్ ప్రతినిధులు సురేందర్, శ్వేత విద్యార్థులు పాల్గొన్నారు.



## మేకలకు నట్టల నివారణ మందుల పంపిణీ

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ మండలం కేంద్రంలో మంగళవారం గ్రామంలోని గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేశారు. సర్పంచ్ ముక్కెర విజయ్, వెటర్నరీ డాక్టర్ సందీప్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సందీప్ మాట్లాడుతూ.. మండలంలో 566 గొర్రెలకు, 242 మేకలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ మందుల వల్ల పశువులు తీసుకునే మేతలోని పోషకాలు శరీరానికి సమర్థంగా చేరి, వాటి పెరుగుదలతో పాటు ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల కారణంగా పశువులకు వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున ముందస్తుగా టీకాలు, మందులు వేయించుకోవడం ఎంతో అవసరమని సూచించారు. అనంతరం సర్పంచ్ ముక్కెర విజయ్ మాట్లాడుతూ.. గ్రామ పశు సంపద రక్షణే లక్ష్యంగా ఇటువంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వైఎస్ మల్లారెడ్డి, వార్డ్ మెంబర్లు భోజన్న, సాయిలు, సంజీవ్, నర్సయ్య, సాయి, సరళ రాణి, రోజా తదితరులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ బోల్తాపడి ఒకరి మృతి.. పలువురికి గాయాలు



**అక్షరటుడే, గాంధారి:** చెట్టును ఢీకొని ట్రాక్టర్ బోల్తా పడగా ఒకరు మృతి చెందారు. పలువురికి గాయాలయ్యాయి. ఈ ఘటన గాంధారి మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పేట్‌సంగం తండా నుంచి చద్మల్ తండాలోని లక్ష్మయ్య ఆలయం వద్ద పండుగ చేసుకునేందుకు సుమారు 20 మంది ట్రాక్టర్‌లో వెళ్తున్నారు. ఈ క్రమంలో నేరల్ గ్రామం వద్ద ట్రాక్టర్ చెట్టును ఢీకొని బోల్తా పడింది. ట్రాక్టర్ ఇంజిన్ వద్ద కూర్చున్న వ్యక్తి సంఘటనాస్థలంలోనే మృతి చెందగా మిగతా వారికి గాయాలయ్యాయి. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. స్థానికులు వెంటనే 108కు సమాచారం ఇవ్వగా వారు క్షతగాత్రులను కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సైతం ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



ట్రాక్టర్ బోల్తాపడ్డ ఘటనలో 15 ఏళ్ల బాలుడు మృతి చెందాడు. దీంతో ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ బాలుడి మృతదేహానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబసభ్యులను ఓదార్చారు. ఆయన వెంట జడ్పీటీసీ మాజీ సభ్యుడు తానాజీ రావు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పట్టణాల్లో అభివృద్ధి జరగాలంటే పన్ను వసూళ్లే ముఖ్యం. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలంటే ఆస్తిపన్ను వసూలు చేయాల్సి ఉంటుంది. బల్దియాకు ఆదాయాన్ని తెచ్చిపెట్టే ముఖ్యమైన వాటిలో ఒకటైన పన్ను వసూళ్లలో బోధన్ బల్దియా వెనకబడింది. నిర్దేశించిన లక్ష్యానికి సగం కూడా చేరుకోకపోవడంతో పట్టణంలో వివిధ రకాల అభివృద్ధి పనులకు నిధుల విడుదలలో జాప్యం జరుగుతోంది. దీనిపై ఇటీవల ఉన్నతాధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడంతో బల్దియా అధికారులు ఆస్తిపన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టారు.

– అక్షరటుడే, బోధన్




# పన్ను వసూళ్లపై ఫోకస్..

- బోధన్ బల్దియాలో ప్రత్యేక ప్రణాళిక
- వసూలు కావాల్సింది రూ.6 కోట్లు
- వసూలైంది రూ. 2.75 కోట్లు మాత్రమే..
- ప్రత్యేక దృష్టి పెట్టిన అధికారులు

బోధన్ బల్దియాలో సుమారు 82వేల జనాభా ఉంది. పురుషులు 30,608 ఉండగా, మహిళలు 31,000 ఉన్నారు. 38 వార్డులు ఉన్నాయి. మహారాష్ట్ర, కర్ణాటక నుంచి కూడా బోధన్ పట్టణానికి ప్రజలు వస్తూపోతుంటారు. అయితే అభివృద్ధి లేకపోవడంతో పట్టణ ప్రజలు ఇప్పటికీ అనేక ఇబ్బందులు పడుతున్నారు. మౌలిక సదుపాయాల కల్పనలో బల్ది యా నిర్లక్ష్యం వహిస్తోందని వాపోతున్నారు.

### మట్టి రోడ్లు, మురికికాలువలు..

పట్టణంలో ఇప్పటికీ చాలా ప్రాంతాల్లో మట్టిరోడ్లే దర్శనమిస్తున్నాయి. వినాయక్‌నగర్, హౌసింగ్‌బోర్డు,



శ్రీరాంనగర్, తట్టికోట్, గౌడ్స్ కాలనీ, రాకాసీపేట్, పాత బోధన్ రంగరేగల్లీ, పాన్‌గల్లీ, ద్యాగంగల్లీ తదితర ప్రాంతాల్లో మట్టిరోడ్లు ఉన్నాయి. దీనికి తోడు డ్రెయినేజీ సౌకర్యం కూడా లేకపోవడంతో మురికినీరు రోడ్లపైనే పారుతోంది.

### ఆస్తి పన్ను టార్గెట్ రూ.6 కోట్లు..

పట్టణంలో రూ.6 కోట్ల ఆస్తిపన్ను వసూలు కావాల్సి ఉంది. అయితే అధికారులు ఇప్పటివరకు రూ. 2.75 కోట్లు మాత్రమే వసూలు చేయగలిగారు. సిబ్బంది కొరత.. ఇతర పనుల కారణంగా పూర్తిస్థాయిలో వసూళ్లపై దృష్టి పెట్టలేకపోయారు. దీంతో పెండింగ్ పన్నులు పెరిగిపోతున్నాయి. దీంతో అభివృద్ధి పనులకు నిధుల్లేకుండా పోయాయి.

### అడిషనల్ కలెక్టర్ ఆదేశాలతో..

ఇటీవల జిల్లా అడిషనల్ కలెక్టర్ అంకిత్ బోధన్ మున్సిపాలిటీని తనిఖీ చేశారు. సబ్ కలెక్టర్ వికాస్ మహతోతో కలిసి బల్దియా పనితీరును పరిశీలించారు. పన్ను వసూళ్ల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎట్టిపరిస్థితుల్లో రూ.6 కోట్ల ఆస్తిపన్ను టార్గెట్‌ను చేరుకోవాలని అధికారులను ఆదేశించారు. వసూళ్ల కోసం టీంలను ఏర్పాటు చేసుకుని రంగంలోకి దిగాలని సూచించారు. దీంతో అధికారులు వసూళ్లను వేగవంతం చేశారు.

### టీంలను ఏర్పాటు చేశాం..



పట్టణంలో ఆస్తిపన్ను వసూళ్లు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాం. పెండింగ్‌లో ఉన్న రూ. 3.75కోట్ల వసూళ్ల కోసం 9 టీంలు ఏర్పాటు చేశాం. స్వయంగా నేను కూడా నిత్యం వసూళ్లకోసం తిరుగుతున్నా. వచ్చే మార్చినెల వరకు 95శాతం పన్ను వసూలు టార్గెట్ పెట్టుకున్నాం. తప్పనిసరిగా టార్గెట్‌ను సాధించేందుకు కృషి చేస్తాం. 95 శాతం వసూలు చేస్తే 15వ ఫైనాన్స్ ఫండ్ వచ్చే అవకాశం ఉంది.

**- జాదవ్ కృష్ణ, మున్సిపల్ కమిషనర్, బోధన్**

## లయన్స్ భవనంలో కంటి వైద్య శిబిరం





**అక్షరటుడే, బాల్కొండ:** మండలంలోని కిసాన్‌నగర్‌లో మంగళవారం బాల్కొండ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆర్మూర్ లయన్స్ కంటి ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ పుణ్యరాజు 25 మందికి కంటి పరీక్షలు చేశారు. మోతి బిందు సమస్య ఉన్నవారిని గుర్తించి శస్త్రచికిత్సల కోసం ఆర్మూర్ లయన్స్ కంటి ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో క్లబ్ జిల్లా ఛైర్మన్ లింగం, జోనల్ ఛైర్మన్ జ్ఞానసాగర్ రెడ్డి, బాల్కొండ క్లబ్ అధ్యక్షుడు దినేష్‌పటేల్ పాల్గొన్నారు.

## బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను ఖండిస్తున్నాం



**అక్షరటుడే,ఇందూరు:** బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని వీహెచ్‌పీ, బజరంగ్ దళ్, హిందూవాహిని నాయకులు అన్నారు. మేరకు మంగళవారం ఆయా సంస్థల ఆధ్వర్యంలో నగరంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నా చౌక్‌లో బంగ్లాదేశ్ ప్రధాని దిష్టిబొమ్మను నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు దినేష్ ఠాకూర్ మాట్లాడుతూ హిందువులపై దాడులను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గాజుల దయానంద్, కోశాధికారి నాంపల్లి శేఖర్, జిల్లా సేవా ప్రముఖ్ రాంప్రసాద్ చటర్జీ, హిందూవాహిని జిల్లా సంయోజక్ సాయి ప్రసాద్, ధాత్రిక రమేష్ పాల్గొన్నారు.

## వైన్స్ తరలించాలని సంఘాల డిమాండ్..



**అక్షరటుడే, ముప్కాల్:** అంగడీలో ఏర్పాటు చేసిన వైన్స్ షాపు కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని ముప్కాల్ మండలం రెంజర్లలో గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. పక్కనే పాఠశాల ఉందని.. అలాగే ఆస్పత్రి కూడా ఉన్నాయన్నారు. మందుబాబుల కారణంగా అవస్థలు పడుతున్నారని వివరించారు.

## ఆటో, బైక్ ఢీ: ఇద్దరు మృతి

**అక్షరటుడే, ఆర్మూర్ :** రోడ్డు ప్రమాదం ఇరు కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. అతివేగం ఇద్దరిని బలితీసుకుంది. ఈ ఘటన ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామ శివారులో మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్మూర్ నుంచి జానకంపేట్‌కు సుమారు ఆరుగురు వ్యక్తులతో ఆటో వెళ్తుండగా.. ఎదురుగా నిజామాబాద్ నుంచి రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై ఆర్మూర్‌కు సాయిప్రసాద్ రాగా.. అంకాపూర్ వద్ద ఈ రెండు వాహనాలు ఎదురెదురుగా బలంగా ఢీకొన్నాయి. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న జానంకపేట్ గ్రామానికి చెందిన సంధ్యారాణి, బైక్‌పై ప్రయాణిస్తున్న సాయికిరణ్ సంఘటనాస్థలంలోనే మృతి చెందారు. ఆటోలో ప్రయాణిస్తున్న మిగతా ఐదుగురికి స్వల్ప గాయాలు కాగా.. వారిని ఆర్మూర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారు చికిత్స పొందుతున్నారు. ఆర్మూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## దేశ ఐక్యతను దెబ్బతీసే కుట్ర: వీహెచ్‌పీ, బజరంగదళ్




**అక్షరటుడే, కామారెడ్డి :** పాకిస్థాన్‌తో విడిపోయిన బంగ్లాదేశ్ మళ్లీ ఆ దేశంతో చేయి కలిపి భారతదేశంలో ఐక్యతను దెబ్బతీసే కుట్ర చేస్తోందని వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ నాయకులు ఆరోపించారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న మారణహోమాన్ని నిరసిస్తూ పైరెండు సంస్థల ఆధ్వర్యంలో మంగళవారం నిజాంసాగర్ చౌరస్తాలో బంగ్లాదేశ్ గుండాల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ సంస్థల ప్రతినిధులు బంగ్లాదేశ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. భారతదేశం పెట్టిన భిక్షతో బంగ్లాదేశ్ ఏర్పడిందన్నారు. అలాంటి దేశం పాకిస్థాన్‌తో చేతులు కలిపి హిందువులపై మారణహోమం సృష్టిస్తోందన్నారు. ఇలాంటి ఘటనలను బంగ్లాదేశ్ తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనలపై భారత ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇరు సంస్థల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రోడ్లపై పశువులను నిలిపి నిరసన

**అక్షరటుడే, బోధన్:** ఇసుక రవాణాపై సాలూర మండలం తగ్గెల్లి గ్రామస్థులు ఆగ్రహ వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం గ్రామంలో వినూత్నంగా నిరసన తెలిపారు. గ్రామంలో నిత్యం ఇసుక అక్రమ రవాణా కారణంగా వాహనాలు ఎక్కువ సంఖ్యలో తిరుగుతున్నాయని పేర్కొన్నారు. దీంతో తాము పొలాలకు పశువులను తీసుకెళ్లాలంటే ఇబ్బంది ఏర్పడుతోందన్నారు. తమ పశువులను రోడ్డుపైనే నిలిపి ఉంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ సరిహద్దులోని మంజీర నది నుంచి వందల సంఖ్యలో ట్రాక్టర్లు ఇసుక నింపుకొని వెళ్తున్నాయన్నారు. రహదారి ఇరుకుగా ఉండడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారుతుందని.. ఎవరికి చెప్పినా పట్టించుకోవట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామస్థులు పశువులను నిలిపి ఇసుక రవాణాలను అడ్డుకున్నారు.



## ఆదర్శ పాఠశాల క్రీడాప్రాంగణం అభివృద్ధికి సహకారం



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో క్రీడా మైదానం అభివృద్ధికి కన్నారెడ్డి గ్రామానికి చెందిన సాయిబాబా విరాళం అందజేశారు. పాఠశాల హెచ్‌ఎంకు రూ.25వేలను అందించారు. విద్యార్థుల విద్య, క్రీడాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా పేర్కొన్నారు. పాఠశాల అభివృద్ధికి తోడ్పాటును అందించిన సాయిబాబాను పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు సన్మానించారు.



## ఎస్సైని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** నాగిరెడ్డిపేట ఎస్సై భార్గవ్ గౌడ్‌ను కాంగ్రెస్ మండల నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. అలాగే మండలంలో గెలుపొందిన సర్పంచులు సైతం ఎస్సైకి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు శ్రీధర్ గౌడ్, రామచందర్ రెడ్డి, గంగారెడ్డి, విఠల్‌రెడ్డి పేర్కొన్నారు.



## చెరువులో చేపపిల్లల విడుదల

**అక్షరటుడే బాల్కొండ:** వేంపల్లిలోని పెద్ద చెరువులో సర్పంచ్ ఎట్టెం మహేష్ యాదవ్ చేపపిల్లలను వదిలారు. మత్స్యకారుల ఉపాధి పెంపు లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దేవేందర్, మత్స్యకారు ల సంఘం అధ్యక్షుడు బట్టు రాజేశ్వర్ పాల్గొన్నారు.

## ఉపాధి హామీ చట్ట సవరణకు వ్యతిరేకంగా నిరసన




**అక్షరటుడే, ఇందూరు:** ఉపాధి చట్టం సవరణను వ్యతిరేకిస్తున్నామని వామపక్ష నాయకులు అన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద గాంధీ విగ్రహం ఎదుట నిరసనకు దిగారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య, మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టంలో మార్పులు తీసుకొచ్చి పేదల పొట్టగొడుతోందన్నారు. చట్టాన్ని నీరుగార్చి జీరాంజీ చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు అన్వర్, అనిల్, ఖాజా మొయినుద్దీన్, పెద్ది వెంకట్ రాములు, వెంకటేష్, అనసూయమ్మ, అనిత, గంగాధర్ పాల్గొన్నారు.